## క్లుప్తంగా

### ట్రిబుల్ ఐటీలో విద్యార్థుల ప్రతిభ



దుగ్గిరాల: ట్రిబుల్ ఐటీ ఫలితాల్లో స్థానిక విద్యార్థులు ప్రతిభ చాటారు. దుగ్గిరాల బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు కొండూరు మణికీర్తన, చలువాది ప్రగతిలు తమ ప్రతిభ కనబరిచారు. కీర్తనకు ఒంగోలు కళాశాలలో సీటు రాగా.. ప్రగతి ఆర్‌కే వాలీ కళాశాలలో సీటు సంపాదించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కుటుంబ సభ్యులు, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఎస్.శోభాదేవి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

### కార్మికుల సమస్యపై ప్రభుత్వం స్పందించాలి



తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యపై కూటమి ప్రభుత్వం స్పందించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి, కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు చట్టప్రకారం తమకు రావాల్సిన నష్ట పరిహారాన్ని మాత్రమే కోరుతున్నారని, యాజమాన్యం, ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్య పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో విజయ మోహనరావు, సీహెచ్ పిచ్చయ్య, ఇస్మాయిల్, కాసమ్మ, రమాదేవి, ఆశీర్వాదం, సాంబశివరావు, జోజి, సువర్ణకుమారి, రమణ, శివకుమారి, ఇమాంబి, శారద, సుభాని తదితరులు పాల్గొన్నారు.

### రోడ్ల గుంతలు పూడ్చండి



తెనాలిఅర్బన్: 34వ వార్డులోని పలు రోడ్లపై గుంతలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని పూడ్చి విధంగా చర్యలు తీసుకోవాలని ఆవార్డు ప్రజలు కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. 32వ వార్డులోని పార్కు స్థలంలో జంగిల్ క్లియరెన్స్ చేయాలని, 28వ వార్డులో మంచినీటి కుళాయి కనెక్షన్ తొలగించాలని, 8వ వార్డు మహేష్ రెసిడెన్సిలో వాటర్ లీక్‌ను అరికట్టాలని పలువురు వినతి పత్రాలు ఇచ్చారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేనేజర్ విల్సన్ జయకర్, డీఈ ఆకుల శ్రీనివాసరావు, ఎసీపీ శివన్నారాయణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

### సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన



తెనాలిఅర్బన్: జీవో నెంబర్ 5ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అన్ని సచివాలయాల ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం కొద్దిసేపు ఆందోళన చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ బదిలీల కోసం ఇచ్చిన జీవో నెంబర్ 5 ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగించే విధంగా ఉందన్నారు. దానిని ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

### యువతి అదృశ్యంపై ఫిర్యాదు

కొల్లిపర: గ్రామంలో బంధువుల ఇంటికి వచ్చి కనిపించకుండా పోయిన యువతి గురించి సోమవారం కొల్లిపర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఎస్ఐ పి కోటేశ్వరరావు తెలిపారు. కెఎల్ యూనివర్సిటీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న 20 సంవత్సరాలు యువతి బంధువుల ఇంటికి వచ్చింది. అయితే మూడు రోజులు తరువాత ఎవరికీ చెప్పకుండా ఇంటి వెళ్లి పోవటంతో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# బాబు మోసాలపై యువత పోరు

- యువత పోరుకు భారీగా తరలివెళ్లిన పార్టీ నాయకులు
- చంద్రబాబుపై ధ్వజమెత్తిన నియోజకవర్గ సమన్వయకర్త వేమారెడ్డి



పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి: అధికారం కోసం అమలు కాని హామీలిచ్చి రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసం చేసిన ఘనుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్) ధ్వజమెత్తారు. సోమవారం గుంటూరు కలెక్టరేట్ వద్ద జరిగిన యువత పోరుకు మంగళగిరి నియోజకవర్గం నుంచి నిరుద్యోగ యువకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు. మండలంలోని ఆత్మకూరు పార్టీ కార్యాలయం నుంచి భారీగా కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను, యువత చేపట్టిన బైక్ ర్యాలీని వేమారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ.. యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన చంద్రబాబుపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరపడ్డాయని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు విద్యార్థులు, యువత ఓట్ల కోసం ఫీజు రీయంబర్స్‌మెంట్, వసతి దీవెన, విద్యాదీవెన, నిరుద్యోగ భృతి రూ.3 వేలు అంటూ హామీలిచ్చి ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు.

#### వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు..

ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయలేక చంద్రబాబు వైఎస్సార్ సీపీ నాయకులుపై కుట్రలు చేస్తూ పోలీసులను అడ్డుపెట్టుకుని తప్పుడు కేసులతో ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరించడం దుర్మార్గమని వేమారెడ్డి అన్నారు. హామీల నుంచి ప్రజల దృష్టిని మార్చేందుకు వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు పార్టీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి మేకా వెంకటరామిరెడ్డి, ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్, రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి ఎండీ గోరేబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, మంగళగిరి పట్టణ, రూరల్ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, నాలి వెంకటకృష్ణ, గుంటూరు జిల్లా పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు ఉత్తేజ్‌రెడ్డి, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు షేక్ గౌస్, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు పులగం సందీప్‌రెడ్డి, మంగళగిరి రూరల్ యువజన అధ్యక్షుడు కొండమడుగుల గోపిరెడ్డి, తాడేపల్లి టౌన్ యువజన అధ్యక్షుడు భూపతి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

#### 'యువత పోరు'కు తరలిన కార్యకర్తలు



దుగ్గిరాల: ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా నిరుద్యోగ భృతి ఇవ్వాలని నిరుద్యోగ యువత డిమాండ్ చేశారు. సోమవారం దుగ్గిరాల వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో మండల, గ్రామాల నుంచి నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో వచ్చారు. ఇచ్చిన హామీలను నేరవేర్చాలని.. నిరుద్యోగులకు భృతి రూ.3 వేలు తక్షణమే ఇవ్వాలని కోరుతూ పార్టీ పిలుపు మేరకు గుంటూరు కలెక్టరు ఆఫీసుకు తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తాడిబోయిన శివగోపయ్య, గ్రామాల నుంచి వచ్చిన యువత పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మె నోటీసులు అందజేత



అడిషనల్ కమిషనర్‌కు సమ్మె నోటీసును అందజేస్తున్న నాయకులు

మంగళగిరి టౌన్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ.. జూలై 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మె నోటీసును సోమవారం అడిషనల్ కమిషనర్ శకుంతలకు ప్రజాసంఘాల నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల పిలుపు మేరకు సార్వత్రిక సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. దానికి సంబంధించిన సమ్మె నోటీసులను అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికులంతా సమ్మెలో పాల్గొనే విధంగా నోటీసులు అందజేశామని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఏఐఎఫ్‌టీయూ నాయకులు అన్నవరపు ప్రభాకరావు, చిన్ని సత్యనారాయణ, నందం బ్రహ్మేశ్వరరావు, గండికో దుర్గారావు, ఎస్ఎస్ చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## కనీస వసతులు లేవని తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

ఫిరంగిపురం: కళాశాలలో తమకున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇమ్మి కాలేజీ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ జె.ప్రసాదరావుకు వినతి పత్రం అందజేశారు. కళాశాలలో సరైన అధ్యాపకులు లేరని.. తమకు ప్రాథమిక అవసరాలు, వసతులు లేవని విద్యార్థులు వాపోయారు. కాలేజీలో చెల్లించాల్సిన ఫీజు చెల్లించడం ఆలస్యం అయితే ఫెనాల్టీలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్‌లో కూడా అదనంగా డబ్బులు చెల్లించాలని యాజమాన్యం చెబుతోందని చెప్పారు. సరైన భోజనం, నీరు సరిగా లేవని తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై కళాశాల యాజమాన్యంతో మాట్లాడి ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళతానని చెప్పారు. ముందుగా విద్యార్థులు కళాశాల నుంచి కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకుడు పవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీవో శివ సుబ్రహ్మణ్యం

ఫిరంగిపురం: ప్రజా సమస్యల పరిష్కారానికే సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు శాఖల అధికారులు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలును వివరించారు. మండల కేంద్రంలో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని చెప్పడంతో సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆశాఖ ఏఈ దుర్గాప్రసాద్ తెలిపారు. సమావేశంలో ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, వైస్ ఎంపీపీ మార్పుల విజయలక్ష్మీ, తహసీల్దార్ జె.ప్రసాదరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: అతిసారంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ షేక్.షహేలా నర్గీస్, జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం అతిసార నియంత్రణ గురించి ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు శ్వేత, యానీ గ్రేస్‌లు మాట్లాడుతూ.. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి 0–5ఏళ్ల చిన్నారులకు రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం 'అతిసారం వ్యాధి నుంచి మీ పిల్లలను రక్షించండి' అనే బ్యానర్‌ను ప్రదర్శించారు. సమావేశంలో నుదురుపాడు, ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యులు సీహెచ్‌వో వెంకటలక్ష్మీ, సూపర్ వైజర్లు కె.సుదర్శన్‌రాజు, షేక్ అబ్దుల్ రెహమాన్, సీడీపీవో అనూరాధ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ చట్ట సంస్కరణ ప్రైవేటీకరణను ఆపాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: విద్యుత్ చట్ట సంస్కరణ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం కాకపోయినా.. విద్యుత్ చట్ట సంస్కరణ పేరుతో ప్రజలపై భారాన్ని వేసే విధానాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని గుండిమెడలో సీపీఎం శ్రేణులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ.. నిరంకుశ వైఖరితో నరేంద్రమోదీ ప్రభుత్వం విద్యుత్ చట్ట సంస్కరణలు చేస్తోందని విమర్శించారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు, ప్రజల నెత్తిన భారాలు వేసేందుకు సిద్ధమౌతోందని అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని పిలుపునిచ్చిన నారా లోకేష్, టీడీపీ నాయకులు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మోదీ విధానాలని అవలంభిస్తూ, ప్రజల నెత్తిన ట్రూ అప్ చార్జీల పేరుతో భారాలు మోపోతోందని మండిపడ్డారు. కార్యక్రమంలో తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ, నాయకులు దొంతిరెడ్డి వెంకట రెడ్డి, డోకిపర్తి రాజేంద్రబాబు, ఎస్.విజయరాజు, చిన్న, గుండిమెడ ఏసురత్నం, దేవదాసు, పల్లె శివయ్య, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా దాడులపై వామపక్షాల నిరసన



మంగళగిరి టౌన్: ఇరాన్‌పై అమెరికా బాంబు దాడులు చేయడాన్ని నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళగిరి నగర పరిధిలోని అంబేడ్కర్ సెంటర్‌లో సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో సోమవారం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ.. ఈ దాడులను ప్రపంచ వ్యాప్తంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. అమెరికా ఇజ్రాయిల్ అనుకూల వైఖరిని విడనాడాలని కోరారు. అంతర్జాతీయ ఉద్రిక్తతలను మరింత పెంచడమే కాకుండా పశ్చిమ ఆసియా అస్థిరతకు దారి తీసే విధంగా అమెరికా సైనిక చర్యలు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో వామపక్ష నేతలు చిన్ని తిరుపతయ్య, అన్నవరపు ప్రభాకర్, నందం బ్రహ్మేశ్వరరావు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, ఎస్ఎస్ చెంగయ్య, జవహర్ లాల్, పి.బాలకృష్ణ, జేవీ రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

తాడికొండ: దేశ సమైక్యత, సమగ్రత కోసం ప్రాణాలర్పించిన నిస్వార్థ దేశ భక్తుడు, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని తాడికొండ నియోజకవర్గ బీజేపీ కన్వినర్ కంతేటి బ్రహ్మయ్య అన్నారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని తుళ్లూరులో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసాద్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చెవుల శ్రీకాంత్, కర్రి వినోద్, వేమూరి శరత్ బాబు, నేరుగ బాబు, అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెట్టుబడి సాయం రూ. 20 వేలు అందించాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు వినతి



తహసీల్దారు సిద్దార్థకు వినతిపత్రం అందజేస్తున్న శివసాంబిరెడ్డి

కొల్లిపర: ప్రభుత్వం సొంత భూమి ఉన్న రైతులతో పాటు కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించాలని కోరుతూ కొల్లిపర తహసీలార్ జి.సిద్ధార్థకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం , కౌలు రైతు సంఘం నాయకులు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం కలసి వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 70 శాతంగా గల కౌలు రైతులకు ప్రభుత్వం ఇచ్చే సాయం పరిహారం, బ్యాంకు రుణాలు అందక తీవ్రంగా నష్టపోతున్నారని వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం 2019 కౌలు చట్టాన్ని మార్పు చేయాలన్నారు. ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జొన్న, మొక్కజొన్న, వరి వంటి పంటలు కోతకు వచ్చే ముందుగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతి గింజను కొనుగోలు చేయాలని కోరారు. వినత పత్రం అందుకున్న తహసీల్దార్ సిద్ధార్థ మాట్లాడుతూ కౌలు రైతులకు సంబంధించిన సమాచారం తీసుకుని వారికి కౌలు కార్డులు ఇప్పించేందుకు ఇప్పటికే సిబ్బంది చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. వినతి పత్రం ఉన్న మిగిలిన విషయాలను జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌలురైతుసంఘంమండల కార్యదర్శి కోట చంద్రశేఖరరావు, మురళి పాల్గొన్నారు.

## సంగీత సాధనపై అవగాహన

లక్ష్మీపురం: సంగీత సాధన ఓ దివ్య తపస్సు వంటిదని సంగీత విద్వాంసులు పి.ఎస్.మూర్తి అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'మనమూ పాడుదాం రండి' బృంద సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ సంగీత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగీత సాధన ద్వారా ఏకాగ్రత, మనోవికాసం పెరుగుతాయన్నారు. సంగీతం ఒక విశ్వ భాష అని, సంగీతానికి పేద, ధనిక, కుల, మతాల, ప్రాంత సరిహద్దులు, సాంస్కృతులు, వర్ణ, వర్గ, వివక్షలు, భాషా భేదాలు ఉండవన్నారు. సుస్వర సంగీతం అందరినీ అలరిస్తుందన్నారు. సంగీత విద్వాంసులు వీఎస్ఎన్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ కష్టాల నుంచి సుఖాలకు, మానసిక ఒత్తిడి నుండి ప్రశాంతత వైపుకు, చీకటి నుంచి వెలుతురు వైపుకు నడిపించే పవిత్ర మాధ్యమమే సంగీతం అన్నారు. కార్యక్రమంలో గాయకులు వై.లక్ష్మి, రాజశేఖర్, సాయిబాబు గీతాలను ఆలపించారు.

## లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలి

తెనాలిరూరల్: జులై 5న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలని న్యాయమూర్తులు న్యాయవాదులను కోరారు. బ్యాంకులు, చిట్‌ఫండ్ కంపెనీలు, ఇతర ఫైనాన్స్ కంపెనీల న్యాయవాదులతో న్యాయమూర్తులు సోమవారం సమావేశం నిర్వహించారు. రాజీ అయ్యే అవకాశం ఉన్న కేలున్నీ రాజీ అయ్యేలా చొరవ చూపాలన్నారు. తెనాలి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు, న్యాయమూర్తులు ఎం. ఇందిరా ప్రియదర్శిని, ఎం. శ్రీధర్, పవన్ కుమార్, వివేక్ వర్ధన్, రాజశేఖర్, బార్ అసోసియేషన్ సెక్రటరీ హరిదాసు గౌరీ శంకర్ , సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.


## ఉపాధి హామీ జాబ్ కార్డులు మంజూరు చేయాలి

గాంధీనగర్ వాసుల వినతి



కొల్లూరు : ఉపాధి హామీ పథకం పనులు చేసుకోవడానికి అవసరమైన జాబ్ కార్డులు మంజూరు చేయకపోవడంతో పనులకు హాజరవ్వలేని పరిస్థితి నెలకొందని పలు కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కొల్లూరు శివారు గాంధీనగర్‌కు చెందిన పలు కుటుంబాల వ్యక్తులు తమకు జాబ్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ ఎంపీడీవో కె.నరసింహారావు, తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఉపాధి హామీ పథకంలో పనులు చేసే అవకాశం లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అగత్యం ఏర్పడిందని తక్షణం జాబ్ కార్డులు మంజూరు చేయించాలని కోరారు. ప్రభుత్వ పథకంలో పక్కా గృహాలు నిర్మించుకోవడానికి సైతం జాబ్ కార్డులు అడుగుతున్న నేపథ్యంలో తమకు కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకుడు బి.సుబ్బారావు పాల్గొన్నారు.

## కృష్ణా నదిలో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవు



కొల్లూరు : కృష్ణా నదిలో ఇసుక తవ్వకాలు చేపట్టడానికి ఎటువంటి అనుమతులు లేవని మైనింగ్ ఆర్ఐ రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. మండలంలోని గాజుల్లంక కృష్ణా నదిలో ఉచిత ఇసుక క్వారీలో గడువు ముగిసినా నిబంధనలను అతిక్రమించి యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నట్లు సమాచారం అందడంతో పరిశీలనకు వచ్చినట్లు ఆయన తెలిపారు. నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా మైనింగ్ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 15తో గడువు ముగిసిన నేపథ్యంలో ఎటువంటి ఇసుక తవ్వకాలు చేపట్టవద్దని గతంలో ఉచిత ఇసుక క్వారీ పొందిన ఏజెన్సీ వ్యక్తులకు తెలియజేశామన్నారు. నదిలో, పట్టా భూములలో గడువు ముగిసినప్పటికీ చేపడుతున్న తవ్వకాలపై ఏజెన్సీ వ్యక్తులను ప్రశ్నించడం జరిగిందన్నారు. ఇసుక నింపుకొని లారీలు వెళుతుండటాన్ని గమనించి వాటిని పరిశీలించగా వారి వద్ద ఎటువంటి బిల్లులు లేకపోవడంతో 3 లారీలను చెరుకుపల్లి పోలీసులకు అప్పగించడం జరిగిందన్నారు. అయితే మైనింగ్ శాఖాధికారుల తూతూ మంత్ర పరిశీలనపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం పోరాడదాం

తెనాలి: జనాభా దామాషా మేరకు చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం ఓబీసీలమంతా సమైక్యంగా పోరాడాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సమగ్ర కుల గణన షెడ్యూల్ గెజిట్ ప్రచురణపై హర్షం వ్యక్తం చేస్తూనే, జనాభా దామాషా మేరకు ఓబీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు ఇవ్వాలనే నినాదంతో ఇకపై దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధపడుతున్నామని శంకరరావు తెలిపారు. కేంద్రంలో ప్రత్యేకంగా ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పరిచి, జనాభా దామాషా మేరకు ఓబీసీ సబ్ ప్లాన్ రూపొందించి, ఆ మేరకు బడ్జెట్లో నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

## 26న తెనాలిలో పోస్టల్ డాక్ అదాలత్

తెనాలిఅర్బన్: రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఆదేశాల మేరకు గురువారం తెనాలిలో డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ ముత్యాల శ్రీనివాసరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కొత్తపేటలోని కార్యాలయంలో కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు.




మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నులకపేట తహసీల్దార్ కార్యాలయం సమీపంలో తాగునీరు పైప్‌లైన్ పగిలింది. దీంతో తాగునీరు వృథాగా రోడ్డుపై ప్రవహిస్తోంది. పైపులైన్ పగిలి రెండు రోజులు అవుతున్నా మరమ్మతులు నిర్వహించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈ పైప్‌లైన్‌ను ఉదయం, సాయంత్రం సమయాల్లో నులకపేట పంప్‌హౌస్ నుంచి నులకపేట, డోలాస్‌నగర్, బ్రహ్మానందపురం ప్రాంతాల్లోని వాటర్ ట్యాంకులను నింపేందుకు ఉపయోగిస్తారు. నిత్యం పైప్‌లైన్ల నుంచి నీరు లీకయ్యి వృథాగా పోతోందని.. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. - తాడేపల్లి రూరల్

## బీసీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన



కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

తాడికొండ: అమెరికాకు చెందిన సూదనగుంట రాఘవేంద్ర ప్రసాద్, సతీమణి కళ్యాణీ ప్రసాద్ కృషితో జిల్లాలో సకల హంగులు, సౌకర్యాలతో బీసీ కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. సోమవారం తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో నిర్వహించ తలపెట్టిన బీసీ కమ్యూనిటీ హాల్‌కు స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దాతల సేవా గుణాన్ని కొనియాడారు. జిల్లాలో 9 కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం చేస్తుండగా తాడికొండ నియోజకవర్గంలోనే రావెల, పెదపరిమి, పొనుగుపాడు గ్రామాల్లో 3 నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాళ్ల వెంకటేష్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు ధనేకుల సుబ్బారావు, జనసేన కన్వీనర్ బేతపూడి విజయ్‌శేఖర్, స్థానిక నాయకులు పువ్వాడ సుధాకర్, పుట్టి రామచంద్రరావు, నూతలపాటి రామారావు, బీజేపీ నాయకులు కంతేటి బ్రహ్మయ్య, జనసేన అధ్యక్షులు నాగరాజు, తహసీల్దార్ సుజాత పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.